

శిథిలావస్థలో హాస్టల్ భవనం

• అరకొర సౌకర్యాలతో విద్యార్థుల అవస్థలు
• నేటికీ బీసీ విద్యార్థులు చదువుకు దూరం

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బిసి సామాజిక వర్గం అత్యధికంగా ఉంది. నేటికీ బిసి హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 17 బిసి సంక్షేమ శాఖ హాస్టళ్లున్నాయి. 2,936 విద్యార్థి , విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆదోని, ఆలూరు పట్టణంలోని అద్దె భవనాలలో అరకోరా సౌకర్యాలతో పడరాని పాట్లు పడుతూ విద్యార్థులు కాలం గడుపుతున్నారు. ఉదాహరణకు పత్తికొండ పట్టణంలోని 45 ఏళ్ల కిందట విద్యార్థులు కోసం హాస్టలను ఏర్పాటు చేశారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో సుమారు 100 మంది విద్యార్థులు చదువుకోవడానికి, పడుకోవడానికి పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. ఒకే భవనంలో 5వ తరగతి నుండి 10 వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు 232 బాలికలకు వసతి కల్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని మొత్తం పది హాస్టల్లో సుమారు 1800 విద్యార్థిని విద్యార్థులుఉన్నారు.



సిబ్బంది కొరతతో అవస్థలు..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద విద్యార్థులను చదివించాలని ఉద్దేశంతో హాస్టలను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు కావలసిన సదుపాయాలు , సిబ్బంది నియమించడంలో పూర్తిగా విఫలం చెందిన సంఘటనలు డివిజన్ కేంద్రమైన పత్తికొండలో చోటుచేసుకుంది. పత్తికొండ, ఆస్పరి, ఎరుకల చెరువు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్, వంట మనుషులు, కమాటి, వాచ్ మెన్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తికొండలోని సరళీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ 400 విద్యార్థులను కలుపుకొని హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో కేటగిరీలు వారిగా వార్డెన్లను నియమించాలి. 400 మంది విద్యార్థులకు ఒక్క వార్డెన్, ఔట్ సోర్సింగ్ ద్వారా ఇద్దరు వంట మనుషులను నియమించారు. పత్తికొండ బాలికల హాస్టల్‌లోని వంట మనిషిని నియమించలేదు. ఆస్పరి బాలుర వసతి గృహానికి వార్డెన్‌తో పాటు కమాటి, వంటలు మనిషి నియమించలేదు. ఎరుకల చెరువు బాలుర వసతి గృహంలో వార్డెన్ లేరు. హాస్టళ్లకు సరైన సిబ్బంది లేకపోవడం విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డెన్లకు అదనపు బాధ్యతలు అప్పగించారని మొరపెట్టుకుంటున్నారు.

జిల్లా అధికారుల ఆదేశాల మేరకే పోస్టులు భర్తీ

- పత్తికొండ ఎఎస్‌డబ్ల్యుఒ కె.బాబు

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు హాస్టల్లో ఖాళీ పోస్టులను పంపించాం. జిల్లా అధికారుల ఆదేశాల మేరకే ప్రభుత్వ నిబంధన ప్రకారమే పోస్టులను భర్తీ చేస్తాం.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

- మాదప్ప, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్

పత్తికొండలో శిథిలావస్థలో భవనం ఉండడం వాస్తవం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకం లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నాం. కొత్త భవనం కోసం నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం.

వర్షం వస్తే కారుతుంది..

- ఇంటర్ విద్యార్థి ఉదయ్, బైపిసి



పాత భవనం కావడంతో వర్షం వస్తే కారుతుంది. ఇంటిదగ్గర సరైన సౌకర్యాలు లేకపోవడంతోని హాస్టల్లో చేరాం. కొత్త భవనం నిర్మించకపోతే విద్యార్థులు హాస్టల్లో చదువుకోవడానికి ఆసక్తి చూపరు. తక్షణమే కొత్త భవనం నిర్మించాలి.

---

669 సెల్ ఫోన్ల రికవరీ

- రూ. 1.20 కోట్ల విలువైన ఫోన్లు బాధితులకు అంద జేసిన ఎస్పి
-అత్యధిక మొబైల్స్ రికవరీ చేసిన పోలీసులకు అభినందన

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు రికవరీ చేసిన 669 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ బాధితులకు అందజేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరడ్ మైదానంలో 'మొబైల్ రికవరీ మేళా' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. జిల్లా ఎస్పి మీడియాతో మాట్లాడారు. కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు 669 (విలువ రూ.1 కోటి 20 లక్షలు) మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. ప్రజలు ప్రయాణాలలో, రైల్వేస్టేషన్లు, జాతరలు, ఉత్సవాలలో ఇలా పలు చోట్ల మొబైల్స్‌ను పోగొట్టుకుంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ పలు జిల్లాల నుండి రికవరీ చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క పోలీసును, ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ పోలీసులను అభినందిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ అనేది మన జీవితంలో ఒక భాగంగా ఉందన్నారు. ప్రతి రోజూ ప్రతి పనిలో మొబైల్ ఉపయోగం ఉంటుందన్నారు. మొబైల్‌లో మనకు సంబంధించిన స్టడీ యాప్స్, చిన్న పిల్లల ఫొటోలు, ఆన్‌లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు పర్సనల్ వివరాలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావాదేవిలు, అటాచ్ మెంట్స్, సెంటిమెంట్స్, ఇలా చాలా మిస్ అవుతూ ఉంటారన్నారు. ఈ సంవత్సరంలో మూడవసారి మొబైల్‌మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగోట్టుకుంటే వెంటనే కర్నూలు పోలీసువెబ్‌సైట్‌కు http:Kurnoolpolice.in/mobiletheft వెళ్ళి పొగోట్టుకున్న మొబైల్ ఐఎఇ వివరాలు తెలియజేస్తే సెల్ ఫోన్ రికవరీ చేసేందుకు కర్నూలు పోలీసులు కృషి చేస్తారన్నారు. ఈ పోలీసు సేవ కు ఎలాంటి రుసుము చెల్లించకుండా ఉచితం అని , మొబైల్ పోయిన తర్వాత బాధపడడం కంటే ఆ మొబైల్ ఫోన్ పోగోట్టుకోకుండా జాగ్రత్తలు పాటించడం మంచిదని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. 669 మొబైల్స్‌లలో అత్యధికంగా రికవరి చేసిన కర్నూలు ఫోర్త్ టౌన్ పిఎస్- కర్నూలు డిఎస్‌పి ఆఫీసు అటాచ్ మెంట్‌లో పని చేస్తున్న శేఖర్‌బాబు 96 మొబైల్స్, ఆదోని టు టౌన్ పిఎస్‌కు చెందిన నాగరాజు 30 మొబైల్స్ , ఇస్వి పిఎస్‌కు చెందిన రామచంద్ర 16 మొబైల్స్ రికవరీ చేయడంతో జిల్లా ఎస్‌పి అభినందించి , ప్రశంసా పత్రాలు అందజేశారు. సెల్ ఫోన్ పొగోట్టుకున్న బాధితులు రికవరీ చేసి ఇచ్చినందుకు ఎస్‌పికి, సైబర్ ల్యాబ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు డిఎస్‌పి బాబుప్రసాద్, సిఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, నాగరాజారావు, శివశంకర్, సైబర్ ల్యాబ్ సిఐ వేణుగోపాల్, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం పోలీసులు పాల్గొన్నారు.



మొబైల్ రికవరీ మేళాలో పాల్గొన్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిలికా శాండ్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పూడిచెర్ల రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్న సిలికా శాండ్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని కలిసి వినతి పత్రం అందజేశారు. జి.రామకృష్ణ తోపాటు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతులు కృష్ణ, సంజన వెంకటేశులు, రామానాయుడులు పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ సిలికాసాండ్ పరిశ్రమ వల్ల ఆ ఎరియాలోఉన్న పంటలు దెబ్బతింటున్నాయన్నారు. రైతుల పంట పొలాలు నాశనం అవుతున్న పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఈ పరిశ్రమకు ఎలాంటి అనుమతులు లేకపోయినా నడుపుతున్నారన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సదరు పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సదరు అధికారులను ఆదేశించారు.

విజయవనం పార్కు అభివృద్ధికి కృషి

• జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి
• పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం
• కార్తీకమాస వనభోజనంలో కలెక్టర్ సిరి, ఇతర ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విజయవనం పార్కును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. బుధవారం నగర శివారులోని వెంకన్న బావి సమీపంలోని విజయవనం (పుల్లయ్య పార్క్)లో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవంలో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జెసి నూరుల్ కమర్, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లా డుతూ... కార్తీక మాసంలో వనసమారాధన ఆచరించడం పర్యావరణ పరిరక్షణకు, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని పచ్చదనం పెంపొందించడంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. విజయవనం పార్కును పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. పర్యాటకులు ప్రకృతి సౌందర్యం కలిగిన విజయవనాన్ని సందర్శించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు..



షటిల్ ఆడుతున్న కలెక్టర్ సిరి, జెసి నూరల్ కమర్

ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపిన అధికారులు : నిత్యం పని ఒత్తిడితో ఉండే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు కాసేపు వాటిని మర్చిపోయి ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. తొలుత కలెక్టర్, జాయింట్ కలెక్టర్ విజయవనంలో మొక్కలు నాటారు. అనంతరం ఉసిరి చెట్టు వద్ద పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ కన్సర్వేటర్ బివి.కృష్ణమూర్తి, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామల, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వరరెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలకు అనూహ్య స్పందన

- 15 వేల మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జనవిజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి సంబరాలు విద్యార్థుల నుండి అనూహ్య స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 15 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 15 మండలాల్లో నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బిడి సుధీర్ రాజు, ఖజాహుస్సేన్ మాట్లాడుతూ నవంబర్ 23న జిల్లాస్థాయి పరీక్షలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలకు అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. సమత నాయకురాలు రమాదేవి, నాయకులు ఆజాద్, ధనుంజయ, రమేష్, సాయి ఉదయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవివి నాయకులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

-సమాచార పౌర సంబంధాల డిడి జయమ్మ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ అన్నారు.బుధవారం కలెక్టరేట్లోని సమాచార శాఖ కార్యాలయావరణలో ఎపిడబ్ల్యుజెఎఫ్ 19వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర అధ్యక్ష శివశంకర్,అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్రకమిటీ సభ్యుడు గోరంట్లప్ప, జిల్లా సీనియర్ నాయకులు పి. చంద్రయ్య,సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ హాజరై కేకును కట్ చేశారు. నిరంతరం జర్నలిస్టుల సమస్యల కోసం పోరాడుతున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ మరెన్నో దినోత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. పత్రికల యాజమన్యాలు విలేకరుల సంక్షేమాన్ని పట్టించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోరంట్లప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ హుస్సేన్, సాక్షి ఎడిషన్ ఇంచార్జి శ్రీనివాసులునాయుడు, సీనియర్ రిపోర్టర్లు చంద్రశేఖర్, చంద్రమోహన్ , వినయ్‌కుమార్,రవి ప్రకాష్, రామకృష్ణ, ప్రతాప్, అనిల్, మణిబాబు, నర్సిరెడ్డి, భాస్కరరావు, బాలకృష్ణ, ఓర్వకల్ మధు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సమాచార పౌర సంబంధాల డిడి జయమ్మ

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



విజేతలతో డాక్టర్ అక్తర్‌భాను, తదితరులు

బాల్యం నుంచే బాలబాలికలలో శాస్త్రీయ భావాలను పెంపొందించాలని క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ హెచ్. అక్తర్ భాను, డాక్టర్ రాంగోపాల్ రావు అన్నారు. కర్నూలు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు పాఠశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు వివిధ పాఠశాలల్లో బహుమతులు అందజేశారు. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ద్వారా సైన్స్ సాధించిన పురోగతిని తార్కాణంగా తెలుపవచ్చునని, మూఢనమ్మకాలను తొలగించుకోవాలని డాక్టర్ అక్తర్ భాను ఉద్బోధించారు. సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం, సెయింట్ జోసెఫ్ విద్యాలయం, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ హెచ్.అక్తర్‌భాను, ప్రిన్సిపల్ ఐశ్వర్య బహుమతులు అందజేశారు. ప్రభుత్వ బాలుర పాఠశాల, భాష్యం పాఠశాల డాక్టర్ రాంగోపాల్ రావు, సిల్వర్ జూబ్లీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎల్ల కృష్ణ, బాలోత్సవ కమిటీ అధ్యక్షులు రఘుబాబు, కార్యదర్శి రమణా రెడ్డి లు అందజేశారు. శాంతినికేతన్ పాఠశాల పాఠశాల కరస్పాండెంట్ పద్మ, కోశాధికారి రంగస్వామి, బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం మెర్సీ, కోఆర్డి నేటర్ పద్మ, ఉపాధ్యయులు రాంచంద్ ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బాలోత్సవ కమిటీ ఆఫీస్ బేరర్స్ ఎల్లా గువేరా, మధు, సాయి ఉదయ్ లతోపాటు ఇతరులు పాల్గొన్నారు.

'కాంకర్ వొకేషనల్'లో మెడికల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



మెడికల్ ఎక్స్‌పోను పరిశీలిస్తున్న డైరెక్టర్

కర్నూలు కాంకర్ వొకేషనల్ జూనియర్ కాలేజిలో మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ , ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్) నర్సింగ్ కోర్సులకు సంబంధించి మెడికల్ ఎక్స్‌ఫో ప్రోగ్రామ్ నిర్వసించారు. ఈ కార్యక్రమం కాంకర్ విద్యా సంస్థల డైరెక్టర్ కొంకతి వేణుగోపాల్ పర్యవేక్షించి ఈ ప్రోగ్రాం వలన ఆయా కోర్సులలో చదువుతున్న విద్యార్థులు ఈ మెడికల్ ఎక్స్‌పో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నర్సింగుకు , ల్యాబ్‌కు సంబంధించి ఎన్నో విషయాలు ఈ కార్యక్రమములో ఆయా లెక్చరర్ ద్వారా విద్యార్థులు ఎంతో నేర్చుకున్నారన్నారు. ఫ్యూచర్లో వారికి ఈ ప్రోగ్రాం పబ్లిక్ ఎక్జామ్స్, పబ్లిక్ ప్రాక్టికల్స్‌కు ఎంతో ఉపయోగపడుతుదని తెలిపారు. విద్యార్థులో నైపుణ్యాన్ని వెలికి తీసెందెకు ఈ కోర్సులకు సంబందించి విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ , థీయరీ నాలెడ్జ్ వస్తుందని విద్యాసంస్థల డైరెక్టర్ కె.వేణుగోపాల్ వివరించారు. విద్యార్థులు మాట్లాడుతూ మాకు ఎంతో ఉపయోగపడిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, వై.గౌతమి సంధ్య, ఎస్.నాగేంద్ర, ఎం. స్వాములు, కె.శ్రీనివాసులు , సబ్జెక్ట్ అధ్యాపకులు ఎ.జేమ్స్, ఇ. అనూష, ద్రాక్ష్యాయణి, కళ్యాణి హరిత మాధవి లత అశోక్, కె. సురేఖ, బింధులత, సౌజన్య, పుష్పావతి, అరుణగీత, సామేలు, రామాంజినేయులు, సూరిబాబు, సురేష్, పాల్గొన్నారు, విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్ ఎంతగానో ఆకట్టుకున్నాయి, వారికిచ్చిన ప్రాజెక్ట్ నమూనాలను చాలా ఉత్సాహంగా ప్రదర్శించారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిజిహెచ్, కెఎంసి సమస్యలు తీరుస్తాం

-సమన్వయంతో మంచి వైద్యం అందించాలి
-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి , మెడికల్ కాలేజీలలో ఉన్న సమస్యలు తీరుస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి , మెడికల్ కాలేజీ అన్ని వైద్య విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల సమస్యలను, వసతులు, పరికరాల లభ్యత తదితర విషయాల గురించి కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది నియామకాలు, వసతులు ఏర్పాటు చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర మంత్రి మంత్రి టిజి.భరత్ సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌తో చర్చించి సమస్యలన్నీ పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. క్యాన్సర్ ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్లను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద కేసులను పెంచాలన్నారు. అనస్తీసియా విభాగానికి డాక్టర్ల కొరత ఉన్నదన్న విషయం కలెక్టర్ దృష్టికి తేగా అవసరమైతే స్థానికంగా ఉండే అనస్థీషియా డాక్టర్లను ఉపయోగించుకునేందుకు వీలవుతుందేమో అని ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. 24 గంటలు ఒక రేడియాలజిస్ట్ డ్యూటీలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గైనకాలజీ విభాగంలో కోతుల సమస్య ఉన్నదని తెలుపగా, అందుకోసం మెష్ ఏర్పాటు చేసే చర్యలు వెంటనే తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయా విభాగాల హెడ్స్ వారికి అవసరమైన పరికరాలు, వసతులు, సిబ్బంది తదితర విషయాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ, జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆయా విభాగాల హెచ్ఒడిలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిజిహెచ్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అందరికీ అందుబాటులో ఉండే విధంగా అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌తెలిపారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కర్నూలు నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 258 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 60 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూపొందించిన ప్రతిపాదనలపై చర్చించామన్నారు. గత అనుభవాల ఆధారంగా ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఒక్కో పోలింగ్ బూత్‌లో 1,200 మంది ఓటర్ల వరకు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈక్రమంలో అధికారులు, బిఎల్ఒలు సంయుక్తంగా 60 నూతన పోలింగ్ బూత్‌లు, 11 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పులు, 25 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పులు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారని, అందరి ఆమోదంతో ఈ మూడు అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు ఆర్ఒ తెలిపారు. ఓటర్లు 18 ఏళ్లు పూర్తయినవారు నూతన ఓటు కోసం ఫారం-6, చనిపోయిన ఓటర్ల తొలగింపు కోసం ఫారం-7, ఓటరు కార్డు సవరణ కోసం ఫారం-8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు నూతన బిఎల్ఎల జాబితాను పార్టీల వారీగా సమర్పించాలని కోరారు. ఓటరు వివరాల తనిఖీ కోసం వెబ్‌సైట్ https:ceoandhra.nic.in ద్వారా లేదా ERO NET ద్వారా తనిఖీ చేసుకోవచ్చు. ఫారం 6,7,8 కోసంస్థానిక బిఎల్ఒను సంప్రదించాలన్నారు. కర్నూలు అర్బన్ తహశీల్దార్ రవి కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్ఒ విశ్వనాథ్

సివిల్ రైట్స్ డే నిర్వహించాలి : కెవిపిఎస్ విజ్ఞప్తి

ప్రజాశక్తి- వెల్దుర్తి: గ్రామీణ ప్రాంతాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వెల్దురి ఎస్ఐ నరేష్‌కు కెవిపిఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. వెల్దుర్తి ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ నరేష్ ను కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి బి కరుణాకర్, కెవిపిఎస్ మండల కార్యదర్శి గురిగింజ నాగరాజు, ఎపిడికెఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, మధులతో కలిసి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ నరేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువా పూలమాలతో సన్మానించారు. ఆనంద్ బాబు మాట్లాడుతూ దళితుల పట్ల చూపుతున్న అవమానాలు, ఆక్రమాలపై ప్రత్యేకమైన దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని కోరారు.



ఎస్ఐని మర్యాపూర్వకంగా కలిసిన కెవిపిఎస్‌నాయకులు

తప్పుచేయక పోయినా అపరాధ రుసుం

-ఒకే నెంబర్ తో రెండు ఆటోలు -ట్రాఫిక్ అధికారుల నిర్వాకం

ప్రజాశక్తి -కోడుమూరు



కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన లక్ష్మన్న ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వాహన యజమాని పేరుతో గత సంవత్సరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ వాట్సప్‌కు ఫోటో, ఎంత మొత్తం చెల్లించాలనే విషయం వాహన యజమానికి ట్రాఫిక్ పోలీసులు ఈ-చలాన్ వాట్సాప్ ద్వారా చేరవేశారు. ఇది చూసిన వాహన యజమాని కంగు తిన్నారు. కారణం ఆ ఈ - చలాన్ నంద్యాల జిల్లా లోని శ్రీనివాస నగర్‌లో ట్రాఫిక్ ఉల్లంఘన జరిగిందంటూ చలానా రాసుంది. ఎందుకంటే ఈ వాహనం ఎన్నడూ కూడా నంద్యాల జిల్లాకు వెళ్లకపోవడమే. మరి చలానా ఎందుకు వచ్చిందని పరిశీలించగా అది తన వాహనం కాదని గుర్తించారు. వాహన యజమానిది అప్పి ఆటో కాగా , ఈ -చలానా లో ఉన్న వాహనం బజాజ్ ఆటోగా గుర్తించారు. ఉల్లంఘన సమయంలో వాహన యజమాని డ్రైవ్ చేయలేదని, అసలు అది తన ఆటో కాదని వాహనం నంద్యాల జిల్లాకు వెళ్లలేదని చెబుతున్నారు. తన ఆటో నెంబర్ ఎపి 21 టి వై 8752 అని, ఇదే నెంబర్ బజాజ్ ఆటోకు ఉన్నందునే ఇలా జరిగిందని గమనించారు. చలాన్ 23/08/2024 న రాత్రి 7:30 నిమిషాలకు ట్రాఫిక్ ఉల్లంఘన జరిగిందని, రూ.2 వేల అపరాధ రుసుం చెల్లించాలంటూ వాట్సాప్ నెంబర్‌కు ఈ చలాన్ వచ్చిందని తెలిపారు. జిల్లా అధికారులు ట్రాఫిక్ నియంత్రణలకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎక్కడైనా ఓవర్ లోడింగు , రాంగ్ రూటు వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే వారి ఫోటోలను తీసి వాట్సాప్‌కు పంపిస్తే అటువంటి వారిని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి, జరిమానా విధించడం ట్రాఫిక్ పోలీసుల నిరంతర ప్రక్రియ. కాగా సదరు ఆటో యజమాని ట్రాఫిక్ పోలీసులు చేసిన పొరపాటును సరిదిద్దాలని వేడుకున్నారు.

మట్టి మిద్దె కూలినా అర్జీ తీసుకోలేదు..!

ప్రజాశక్తి- సి బెళగల్



మట్టి మిద్దె ఇటీవల కురిసిన వర్షాలకు కూలింది. ఈ సంఘటన గత నెల 29న జరుగగా ప్రభుత్వం ఆదుకుంటుందని అర్జీ ఇస్తే రెవిన్యూ కార్యాలయంలో తీసుకోబోమని అంటున్నారని మీడియా ముందు కంభదహాల్‌కు చెందిన తిమ్మప్ప కలెక్టర్‌కు మొరపెట్టుకుంటున్నారు. వర్షాలు పడుతున్నప్పుడు ప్రమాదం తప్పిందని తప్పనిపరిస్థిలో ఇంటి బయట నివాసం చేస్తున్నామని అన్నారు. గత నాలుగు రోజులుగా అర్జీ పట్టుకొని తిరుగుతున్నా ఏ రోజుకారోజు అర్జీలు పంపించామని ఒక రోజు గడిచిన తర్వాత ఇచ్చే అర్జీలు కలెక్టర్ తీసుకోకూడదని ఆదేశించారని మాతో చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిన ఇంటిని పరిశీలించి పరిహారం ఇవ్వాలని ఆ పై నూతన ఇంటిని మంజూరు చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను బాధితుడు వేడుకొంటున్నారు


వినతి పత్రం అందజేస్తున్న రామకృష్ణ, నాయకులు

పత్తి రైతుకు అన్యాయం చేయొద్దు

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పత్తి రైతులకు అన్యాయం చేయవద్దని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తరుగు లేకుండా ఇవ్వాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, కోటకొండ సూరి డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు సెక్రటరీ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. నియోజకవర్గంలో అత్యధికంగా పత్తి పంట సాగు చేసినట్లు తెలిపారు. అధిక వర్షాలు, తుపాను నేపథ్యంలో పత్తి పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే పత్తి కేవలం రెండు, మూడు క్వింటాళ్లు మాత్రమే వస్తోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొంతకాలంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడంతో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, తేమ శాతం పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నట్లు చెప్పారు. దీనిని అరికట్టకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని, కొనుగోలు కేంద్రాలు పెట్టినా వృథా అయ్యే అవకాశం ఉందని తెలిపారు. 15 శాతానికి పైగా తేమ ఉన్నప్పటికీ పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రతి రైతుకూ వచ్చేటట్లు చూడాలని కోరారు. మార్కెట్ యార్డు కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ... ప్రభుత్వానికి తెలియజేసి పూర్తిస్థాయిలో పత్తిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నరసింహులు, వీరేష్, కొండారెడ్డి, నరసింహుడు, పెద్దయ్య పాల్గొన్నారు.

యూరియా కోసం రైతు పోరాటం

- ఆర్ఎస్‌కె వద్ద గుమికూడిన రైతులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వివిధ గ్రామాల్లో గత కొద్ది రోజులుగా వర్షాలు పుష్కలంగా కురుస్తుండడంతో పంటలకు ఎరువు మందులు చల్లుకోవడం కోసం యూరియా బస్తాల కోసం రైతులు ఆరాట పడుతున్నారు. గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ అధికారులు యూరియా పంపిణీని బుధవారం ప్రారంభించారు. పంపిణీ కేంద్రం వద్ద ఉదయం నుంచే రైతులు పాసు పుస్తకాలతో గుమికూడి యూరియా బస్తాల కోసం బారులు తీరారు. అందరి కంటే ముందుగా తామే యూరియా బస్తాలను దక్కించుకోవాలన్న ఆరాటంతో రైతులు ఆర్ఎస్‌కె ముందు గుమికూడి లోపలికి వెళ్లేందుకు పెద్ద పోరాటానికి దిగిన వారిలా ఆరాట పడిపోయారు. యూరియా పంపిణీ చేసే వ్యవసాయ సిబ్బంది కూడా ఇబ్బంది పడాల్సి వచ్చింది. జోరుగా వర్షాలు కురుస్తుండడంతో రబీ ఆరంభంలో సాగు చేసిన పంటలకు ఎరువులు చల్లుకునేందుకు ఇదే మంచి తరుణమని రైతులు ఎగబడుతున్నారు. ఇలాంటి తరుణంలో వ్యవసాయ అధికారులు అత్యధిక మోతాదులో యూరియా బస్తాలను తెప్పించి గోనెగండ్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో యూరియా అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రైతు సేవా కేంద్రం వద్ద గుమికూడిన రైతులు

రెండు యూరియా బస్తాలు దొరికాయి

- రైతు కృష్ణ, గోనెగండ్ల



నాకు 5 ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం ఈ పొలంలో మొక్కజొన్న సాగు చేశాను. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మొక్కజొన్నకు భూమి మందులు చల్లేందుకు యూరియా బస్తాల కోసం ఉదయం 7 గంటలకే పాసు పుస్తకాలు పెట్టి లైన్‌లో నిలబడ్డాను. సుమారు 3 గంటలు నిలబడితే నాకు రెండు యూరియా బస్తాలు దొరికాయి. రబీ పంటల ఆరంభ సమయంలో కురుస్తున్న వర్షాలకు పంటలు మంచి అదునులో ఉన్నాయి. రైతులకు యూరియా వీలైనంత ఎక్కువ మోతాదులో అందుబాటులో ఉండేలా చూడాలి.

280 బస్తాలు పంపిణీ చేశాం

- షఫీ, గ్రామ వ్యవసాయ సహాయకులు

గోనెగండ్ల, ఎర్రబాడు, చిన్నమరివీడు రైతు సేవా కేంద్రాల్లో బుధవారం 12.5 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియాను పంపిణీ చేశాం. 280 బస్తాల యూరియా కూడా ఆర్డర్ చేశాం. రెండు రోజుల్లో గోనెగండ్లకు అందుబాటులో రానుంది. గురువారం పెద్దమరివీడు, అల్వాల, నెరడుప్పల గ్రామాల్లో ఒక్కో కేంద్రంలో 12.5 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా పంపిణీ చేస్తాం.


మాట్లాడుతున్న పీఠాధిపతులు శ్రీసుబుధేంద్ర తీర్థులు

నదీ జలాల సంరక్షణ అందరి బాధ్యత

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

నదీ జలాల సంరక్షణ అందరి బాధ్యత అని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు తెలిపారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక తుంగభద్ర నదీతీరంలో తుంగా హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నదుల పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, చెత్తాచెదారం, తొడిగిన బట్టలు నదీ పరివాహక ప్రాంతంలో వదిలి కలుషితం చేయొద్దని భక్తులకు హితవు పలికారు. శ్రీమఠం పీఠాధిపతులు పూర్వాశ్రమ తండ్రి రాష్ట్రపతి ప్రతిభా అవార్డు గ్రహీత, పండితకేసరి మహా మహోపాధ్యాయ విద్వాంసులు రాజా ఎస్.గిరియాచార్యులు, పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్, శ్రీమఠం ఎఇఒ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్.శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్ పాల్గొన్నారు.

తుంగా తీరంలో భక్తి గీతాలు : తుంగభద్ర నదీతీరంలో గాయకులు ఆలపించిన భక్తి పాటలు భక్తులను వీనులవిందు చేశాయి. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో తుంగా హారతిలో సంగీత కచేరి ఏర్పాటు చేశారు. రాయచూరుకు చెందిన పద్మశ్రీ కెరూర్, రాణె బెన్నూర్‌కు చెందిన రజనీ కరిగార్‌లు పాడిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. సంగీత కళాకారులు హార్మోని శ్రీపాద చార్, తబల కెరూర్ సేతు మాధవ, తాళం కెరూర్ జితామిత్ర పాల్గొన్నారు.

డ్రగ్స్, మాదకద్రవ్యాలపై ఉద్యమం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న నాయకులు

డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని డివైఎఫ్ఐ డివిజన్ మాజీ కార్యదర్శి లక్ష్మణ్ కోరారు. బుధవారం పట్టణంలో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. డివైఎఫ్ఐ పట్టణ నాయకులు వీరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. యువత అభ్యున్నతి, ఐక్యత కోసం కృషి చేస్తూ, వారిలో దేశభక్తి భావాలు పెంచుతూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో డివైఎఫ్ఐ కీలకంగా పని చేస్తోందని తెలిపారు. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న మాదకద్రవ్యాలు, మద్యం వినియోగం, అత్యాచారాలు వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా, పర్యవేక్షణ పరిరక్షణ కోసం, శ్రమదానం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు శక్తి సామర్థ్యాల మేరకు సహాయ, సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో యువత సమస్యలపై పెద్ద ఎత్తున పోరాడేందుకు సన్నద్ధం కావాలని తెలిపారు. నాయకులు వీరేష్, వినోద్, నరసింహులు పాల్గొన్నారు.

ఎస్ఐ సతీష్ కుమార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సతీష్ కుమార్‌ను బుధవారం నంచర్ల గ్రామస్తులు, టిడిపి నాయకులు కలిసి శాలువా, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిప్పగిరికి వచ్చిన ఎస్ఐ సతీష్ కుమార్‌ను టిడిపి నంచర్ల గ్రామ నాయకులు ఉసిని రామాంజనేయులు, బోయ తిమ్మప్ప, ఉసిని వెంకటేశులు, రవితేజ మర్యాదపూర్వకంగా కలిశారు. బోయ తిమ్మప్ప మాట్లాడుతూ... టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివ ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో మండలంలో అభివృద్ధి పనులకు కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాలు అభివృద్ధి దశలో పయనిస్తాయని, ప్రతి ఒక్కరూ సహకరించుకుని ముందుకెళ్లాలని కోరారు.



ఎస్ఐ సతీష్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

గౌరవ ప్రదమైన వృత్తి పోలీసు

- సిఐ మంజునాథ్

ప్రజాశక్తి - కోసిగి

సమాజంలో ఎంతో విలువైన, గౌరవప్రదమైన ఉద్యోగమే పోలీసని సిఐ మంజునాథ్, ఎస్ఐ రమేష్ రెడ్డి, ట్రెయినీ ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు. మండలంలో నూతనంగా పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన యువకులను బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో శాలువా, పూలమాలతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలోనే వెనుకబడిన కోసిగిలాంటి మారుమూల ప్రాంతంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 16 మంది పోలీసులు, 32 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన యువత గ్రామాల్లో ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో మండలాన్ని అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్ది ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని కోరారు. ఉద్యోగం సంపాదించిన యువకులు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు.



పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న సిఐ

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

- టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని మాధవరం గ్రామంలో వడ్డే శారదమ్మ అనారోగ్యంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారని, ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు కావడంతో ఆమె భర్త వడ్డే వీరేష్‌కు రూ.50 వేల చెక్కును అందజేసినట్లు చెప్పారు. యువ నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి, నారాయణ, నర్సా రెడ్డి, ఉమాకాంత్, నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న నాయకులు

గుండెపోటుతో కూలీ మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ గ్రామానికి చెందిన కూలీ పోలకల్ రంగన్న (58) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు రంగన్న గ్రామంలో ఒక రైతు దగ్గర సేద్యానికి కూలీగా పని చేసేవారు. తెల్లవారుజామున 1 గంట సమయంలో గుండె నొప్పితో మృతి చెందారు. రంగన్నకు పొలం కానీ, సొంత ఇల్లు కానీ లేదు. చాలామంది రైతుల అభిమానాన్ని అతను చూరగొన్నారు. రంగన్న మరణ వార్త విన్న వెంటనే ఉదయాన్నే గ్రామంలోని కొంతమంది ఎద్దులు ఉన్న రైతులు ఒక కాడికి రూ.1000 చొప్పున జమ చేసుకొని ఆ కుటుంబానికి రూ.56 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే గ్రామంలోని టిడిపి నాయకులు రూ.5 వేలు, పెట్రోల్ బంకు యజమాని రూ.5 వేలు, ఆటో డ్రైవర్స్ రూ.2 వేలు మృతుని మట్టి ఖర్చులు రూపంలో ఆయన భార్యకు అందజేశారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కోసిగి



కోసిగి ఎంపిడిఒగా మహబూబ్ బాష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తుగ్గలి మండలంలో పరిపాలన అధికారి నుంచి ప్రమోషన్‌పై ఎంపిడిఒగా కోసిగికి వచ్చారు. గతంలో పని చేసిన ఈశ్వరయ్య స్వామి డిప్యూటీ ఎంపిడిఒగా కోసిగిలోనే కొనసాగుతున్నారు. మండలంలో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు కృషి చేసి, మండల అభివృద్ధికి పని చేస్తామని తెలిపారు.

ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం

- అభివృద్ధికి దూరంగా ఆలూరు ప్రాంతం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆలూరు

చిత్తశుద్ధి లేని ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యంతోనే ఆలూరు ప్రాంతం అభివృద్ధికి దూరమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు విమర్శించారు. బుధవారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి అధ్యక్షతన జీపుజాతాను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేదవతి, నగరడోన రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి, పనులు చేపట్టాలని ఈనెల 9, 10వ తేదీల్లో ఆలూరు నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టి మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఆలూరు ప్రాంత ప్రజలను, రైతులను చైతన్య పరచి పాదయాత్రలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాలు పంచుతూ జీపుజాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేదవతి (హగరి) నదిలో ప్రతేడాది వందల టిఎంసిల నీరు తుంగభద్రలో కలిసి సముద్రం పాలవుతోందని తెలిపారు. వేదవతిపై ఎత్తిపోతల ద్వారా 8 టిఎంసిలతో రిజర్వాయర్ నిర్మిస్తే అధికారికంగా 80 వేల ఎకరాలకు సాగునీరందించి, 253 గ్రామాలకు నీరందించవచ్చని రిటైర్డ్ ఇంజినీర్ సుబ్బారాయుడు ప్రభుత్వానికి నివేదిక అందించారని, 2018లో టిడిపి ప్రభుత్వం వేదవతికి రూ.1800 కోట్లు మంజూరు చేిందని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి రూ.60 కోట్లు ఖర్చు చేసి నిధులను పక్కదారి పట్టించిందని విమర్శించారు. రూ.60 కోట్లతో పూర్తి చేయాల్సిన నగరడోన రిజర్వాయర్‌ను బిల్లులు రాక మధ్యలో వదిలేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తామని చెబుతూ ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలకు, సోలార్, విండ్ పవర్, పవర్ గ్రిడ్‌లకు ఆలూరు ప్రాంతంలోని సాగు భూములను దోచి పెడుతోందని మండిపడ్డారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రైతులు, కూలీలు వలస వెళ్లి ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని తెలిపారు. వెదవతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు, గండి పడిన హెబ్బటం, చిన్నహోతూరు చెరువులకు మరమ్మతులు, నియోజకవర్గంలోని వాటర్ స్కీమ్‌ల నుంచి నీరు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు షాకీర్, కృష్ణ, ఈరన్న, వీరేష్, మైనా, గోవర్ధన్, ధనుంజయ, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు.


జీపు జాతాను ప్రారంభిస్తున్న వెంకటేశులు


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ పుల్లయ్య

పిల్లల ఆరోగ్య పరిరక్షణకు కృషి : ఎంపిడిఒ


ప్రజాశక్తి - నందవరం

పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. బుధవారం ఆయన పెద్దకొత్తిలి గ్రామాన్ని సందర్శించి, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రికార్డులు పరిశీలించి, చిన్నపిల్లలకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని తెలిపారు. బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, చిన్నపిల్లల పరిశుభ్రత, పౌష్టికాహారం అందించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. అనంతరం సచివాలయం సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతి సర్వేనూ పూర్తి చేసి, సిటిజన్ ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ ఎంపిడిఒ సందీప్, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, గ్రామ పెద్దలు సూరి, సోమన్న పాల్గొన్నారు.

తుంగభద్ర నదిలో మొసళ్లు

- భయాందోళనలో నదీతీర గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - కౌతాళం



మండలంలోని తుంగభద్ర నదిలో మొసళ్లు సంచరిస్తున్నాయి. నదీతీర గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. గత రెండు రోజుల నుండి కుంభాలనూరు గ్రామ సమీపంలో తుంగభద్ర నదిలో రెండు పెద్ద మొసళ్లు గ్రామస్తులకు కనిపించడంతో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. నదీతీరంలో పంటలు సాగు చేసిన రైతులు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు భయాందోళనకు గురవుతున్నారు. తుంగభద్ర నదీతీరంలోని వివిధ ప్రాంతాల్లోనూ మొసళ్లు కనిపిస్తూనే ఉన్నాయని వివిధ గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. తుంగభద్ర నదిలో సంచరిస్తున్న మొసళ్లను సంబంధిత శాఖాధికారులు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - దేవనకొండ


మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపిడిఒ జ్యోతి కోరారు. బుధవారం మండలంలోని గుండ్లకొండ గ్రామాన్ని ఆమె సందర్శించారు. బేస్ మట్టం, లెంటల్ లెవెల్‌లో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఎఇ అనిరుధ్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే కూటమి లక్ష్యం

- టిడిపి మండల అధ్యక్షులు ఖాసీం వలీ

ప్రజాశక్తి - నందవరం

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ తెలిపారు. బుధవారం మాచాపురం గ్రామస్తులకు పట్టాలు ఇవ్వడానికి స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి పేదకు ఇల్లు ఉండాలన్న సంకల్పంతో.. వాటి నిర్మాణానికి పట్టాలు ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ప్రజలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. తహశీల్దార్ శ్రీనివాసులు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మహేష్, విఆర్ఒ నరసప్ప, టిడిపి మాచాపురం నాయకులు పీర్ సాహెబ్, బడే సాబ్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

- ప్రాథమిక పాఠశాల ముందు సొరంగం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి నీళ్ల ట్యాంకు పక్కన మెయిన్ రోడ్డుపై పురాతన సొరంగం బయటపడింది. దీంతో విద్యార్థులు, ప్రజలు భయంభయంగా గడుపుతున్న సంఘటన బుధవారం చిప్పగిరిలో చోటు చేసుకుంది. చిప్పగిరి ప్రాథమిక పాఠశాల దగ్గరలో మెయిన్ రహదారి పక్కన పురాతన కాలంలో పెద్దలు ధాన్యం దాచి ఉంచేందుకు పాతరలను (భూమిలో సొరంగం) ఉపయోగించే వారు. ఇటీవల కురుస్తున్న అధిక వర్షాల వల్ల నీరు నిల్వ రోడ్డుపై ఉండి పాతర కూలిపోయి పెద్ద ఎత్తున రంధ్రం ఏర్పడింది. గ్రామస్తులు, చిన్నపిల్లలు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసు సిబ్బందికి, పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే పాతర రంధ్రాన్ని పూడ్చి ప్రమాదం నుంచి కాపాడాలని గ్రామస్తులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


చిప్పగిరిలో బయటపడిన పురాతన సొరంగం

ఘనంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వైద్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఆర్థోస్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ మల్లికార్జున హాజరయ్యారు. గౌరవాధ్యక్షులు దేవేంద్ర మూర్తి, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు షబ్బీర్, సాక్షి నాగరాజు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, గిబ్సన్, ఎరుకల వెంకటేష్, జాయింట్ సెక్రటరీ ఖాదర్ బేగ్, సోహెల్, విలేకరులు ఖాసీం, రాజేష్, రహిమాన్, ఖలీల్ జిలాన్, శంకర్, రాజు, విజయ్ ప్రసాద్, వీరేష్, రంగయ్య, మురళీ, మునీర్, మోష, ఆచారి, సురేంద్ర, సునీల్, రహిమాన్, నందవరం పార్థు, రుక్మన్, వెంకటేష్, గోనె గండ్ల గౌస్, ఖాసీం, జయన్న, వీరనాయుడు, దేవరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష దీపోత్సవ కాంతుల్లో శ్రీమఠం ప్రకాశించింది. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో శ్రీమఠం ఆవరణంలో భక్తులు లక్ష దీపాలను వెలిగించారు.


భారీ పోలీసు బందోబస్తు : లక్ష దీపోత్సవం భారీ పోలీసు భద్రత కల్పించామని సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ముందు జాగ్రత్త చర్యగా మొత్తం 58 మందితో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముగ్గురు సిఐలు, ఐదుగురు ఎస్ఐలు, 10 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 32 మంది కానిస్టేబుళ్లు, 8 మంది స్పెషల్ పోలీసులు, 8 మంది హోమ్ గార్డులు ఉన్నారని తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో జరిగిన భక్తుల తొక్కిసలాటలో 9 మంది మృతి చెందిన నేపథ్యంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు భక్తులకు భద్రత కల్పించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

పైపులైన్ ఏర్పాటుతో నీటి సమస్య పరిష్కారం

- టిడిపి నాయకులు, మాజీ సర్పంచి రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలోని బీసీ కాలనీలో పైపులైన్ ఏర్పాటు చేయడంతో నీటి సమస్య పరిష్కారమవుతుందని టిడిపి నాయకులు, మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామ కార్యదర్శి వేణుగోపాల్‌తో కలిసి పైపులైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ నిధులతో పైపులైన్ వేసినట్లు తెలిపారు. నీటి ఎద్దడి తీవ్రత తగ్గుతుందని చెప్పారు. శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవాలని రాఘవేంద్ర రెడ్డి సూచించారు. సచివాలయ ఇంజినీర్ పవన్, విజయకుమార్, ఆలం హుస్సేని, మహబూబ్ బాష, ఉరుకుంద, ఐటిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మైబు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న నాయకులు

అన్ని రకాల పరీక్షలకూ కేరాఫ్ 'ఆర్బిట్'

- డైరెక్టర్లు వినయ్, మధుసూదన్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఆధునిక యంత్రాలతో అన్ని రకాల పరీక్షలూ నిర్వహిస్తూ రోగుల మన్ననలు పొందుతున్న ఆర్బిట్ డయాగ్నోస్టిక్ ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్లు వైద్యులు వినయ్, మధుసూదన్ కోరారు. బుధవారం ల్యాబ్‌లో అందుతున్న సేవలను వివరించారు. వారు మాట్లాడుతూ... హైదరాబాద్, కర్నూలు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండే పరీక్షలన్నీ ప్రస్తుతం ఆదోని ఆర్బిట్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో ఉన్నాయన్నారు. ఎంఆర్ఐ, సిటి స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే ల్యాబ్, ఒపిజి, డెంటల్ స్కాన్ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ పరీక్షల కోసం గతంలో హైదరాబాద్, కర్నూలు వంటి ప్రాంతాలకు రోగులు వెళ్లేవారని చెప్పారు. 2021 మార్చిలో ఆదోనిలోని ఎస్‌కెడి కాలనీలో ఆర్బిట్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో 24 గంటలలూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఎంఆర్ఐ స్కాన్ కోసం గతంలో రోగులు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం నాణ్యమైన పిక్చర్‌తో, స్పష్టమైన వివరాలతో రిపోర్టు ఇస్తామని తెలిపారు. పోలీసు శాఖ డిజిపి ప్రశంసలు కూడా తాము అందుకున్నామన్నారు. పోలీసులు, మున్సిపల్ ఉద్యోగులకు, సిబ్బందికి, ఆర్‌టిసి ఉద్యోగులకు నెల రోజుల పాటు నిరంతరంగా ఉచిత ఆరోగ్య పరీక్షలు చేశామన్నారు. కిడ్నీ ప్రొఫైల్, లిపిడ్ ప్రొఫైల్ చేయించామన్నారు. వాటితోపాటు సిబిపి, సిఆర్‌పి, అల్ట్రాసౌండ్, అబ్ డానిమల్ పరీక్షలు చేసి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. ఎమ్మిగనూరు, ఆదోనిలో ఆర్బిట్ డయాగ్నోస్టిక్ ల్యాబ్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇలాగే ప్రోత్సహిస్తే ల్యాబ్ సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు. తమ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ల్యాబ్ మేనేజర్ సుధాకర్ 7013579039 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.


మాట్లాడుతున్న డైరెక్టర్లు



ఆర్బిట్ డయాగ్నోస్టిక్ ల్యాబ్

పని చేసే వారికి కమిటీల్లో ప్రాధాన్యత



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఆదిమూలపు సతీష్

గ్రామ, అనుబంధ విభాగాల ఏర్పాటుకు దిశానిర్దేశం

ప్రజాశక్తి- కోడుమూరు

కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టిడిపి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల ఏర్పాటుపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. మన నియోజవర్గం నుంచి కోటి సంతకాల కార్యక్రమాన్ని, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాలన్నీ ఫోకస్డ్‌గా ముందుకెళ్లాలని ఆర్గనైజేషన్ స్ట్రక్చర్‌పై సీరియస్‌గా దృష్టిపెట్టాలన్నారు. కమిటీల నియామకాలు పకడ్బందీగా చేయాలని, ఎక్కడా పొరపాట్లకు తావు ఇవ్వకూడదని సూచించారు. అనుబంధ విభాగాలు గట్టిగా నిలబడినప్పుడే ఎన్నికల్లో ధీటుగా నిలబడతామన్నారు. గ్రామ స్థాయి వరకు పదాతి దళం సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. కొన్ని విభాగాలు మరింత ఫోకస్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి అభ్యర్థుల విజయానికి బాటలు వేయాలన్నారు. కమిటీల ఏర్పాటుపై సీరియస్‌గా దృష్టిపెట్టాలని.. కమిటీలన్నీ పూర్తయితే మన బలం మరింత పెరుగుతుందని చెప్పారు. పదవులు అలంకారప్రాయంగా కాకుండా పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టాలన్నారు. పదవులు పొందిన వారంతా తగిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. క్రియాశీలకంగా ఉండగలిగేవారికి కమిటీలలో ప్రాధాన్యత ఇవ్వాలని, మనమంతా కలిసి పార్టీని బలోపేతం చేద్దామన్నారు. మరోసారి మన నాయకుడు జగన్‌ను సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. అనుబంధ విభాగాలకు సంబంధించి అందరం కలిసి పనిచేద్దామని, మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రచ్చబండ- కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాను అందరితో సమన్వయం చేసుకుంటూ ముందుకువెళతానని అన్నారు. మన అనుబంధ విభాగాలు స్థానికంగా ఉన్న సమస్యలపై ఎప్పటికప్పుడు ఫోకస్ చేసి ప్రజల తరుపున నిలబడదామన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు మండల కన్వీనర్ రమేష్ నాయుడు, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, రవికుమార్ రెడ్డి, కర్నూలు మండల కన్వీనర్ మోహన్ బాబు, రాజారెడ్డి, చిన్నవెంకటేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, మాజీ సర్పంచి సూర్యనారాయణ, ఎంపిటిసి సుంకన్న, నడిపి రాముడు, వెంకటేష్, సురేష్, వెంకట రాముడు, రఘురాముడు, యేసురాజు, భాస్కర ఆచారి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

976 గృహాలు లబ్ధిదారులకు అప్పగిస్తాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : టిట్కో గృహాలను ఈనెల 17న 976 లబ్ధిదారులకు అప్పజెప్తామని టిట్కో గృహాల అధికారి పెంచలయ్య చెప్పారు. ఇప్పటిదాకా ఇక్కడ 150 మంది నివాసం ఉంటున్నారని చెప్పారు. డబ్బులు కట్టిన లబ్ధిదారులకు బ్యాంకు వారు వడ్డీని మాత్రం ప్రభుత్వం అడ్జస్ట్ చేసిందని తెలిపారు. సింగిల్ బెడ్ రూమ్ రూ.25 వేలు, డబుల్ బెడ్ రూమ్ రూ.50 వేలు మొత్తంగా చెల్లిస్తే వారి ఇండ్లను అప్ప చెప్తామని తెలిపారు. 10,000 గృహాలు నిర్మిస్తే కేవలం 150 మంది మాత్రమే కాపురం ఉండడానికి గల కారణం అక్కడ సరైన మౌలిక వసతులు (రవాణా సౌకర్యం, మార్కెట్, అంగన్వాడి సెంటర్ హెల్త్ సెంటర్, పోలీస్ పికెటింగ్, నీటి సౌకర్యం) లేకపోవడం అక్కడ ప్రజలు వెళ్లి ఉండడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే మౌలిక వసతులు అన్ని కల్పిస్తే ప్రజలు అక్కడే ఉండి నివాసం చేయడానికి ఇష్టపడతారు. అధికారులు వీలైనంత త్వరలో గృహాలను మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. టిట్కో గృహాల లబ్ధిదారులు వెంటనే ఏక మొత్తంలో డబ్బులు చెల్లించి తమ గృహాలను స్వాధీనం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

ప్రమాదాలు జరిగితే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్: ప్రయివేటు ,ఆర్టీసి ట్రావెలింగ్ బస్సులలో ముఖ్యంగా రాత్రి పూట తిరిగే బస్సులలో సరైన భద్రతా చర్యలు ,జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన బస్సు దుర్ఘటన నేపథ్యంలో జిల్లా ఎస్‌పి పోలీసు అధికారులను అప్రమత్తంగా ఉండాలని తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేస్తున్నారు. ప్రయాణికుల రక్షణ ,భద్రతా ప్రమాణాలను పరిశీలించి, అవి సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించడానికి విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్‌ల లైసెన్సులు, బస్సుల్లోని భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించాలని వారిని హెచ్చరించి పంపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భధ్రతా ప్రమాణాలు పాటించని ప్రవేట్ ట్రావెల్స్ బస్సుల యాజామాన్యాల పై చర్యలు తీసుకోనున్నామని పోలీసు అధికారులు హెచ్చరించారు. పోలీసులు "ఫేష్ వాష్ అండ్ గో " కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు ఫేష్‌వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్- బెంగుళూరు, హైదరాబాద్ - చైన్నె ల నేషనల్ హైవే - 40, నేషనల్ హైవే- 44 ల లో ఉన్న పుల్లూరు టోల్గేట్, అమకతాడు టోల్గేట్, నన్నూరు టోల్గేట్ లలో లారీలు, బస్సులు, కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరోలను పోలీసులు ఆపి ఆ డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని డ్రైవర్లకు గుర్తు చేస్తున్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులకు విద్య సాధన సామాగ్రి పంపిణీ

విద్యాసాధన సామాగ్రిని వినియోగించుకొని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి సబీహా పర్వీన్, హజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి సూరి మన్సూర్ అలీఖాన్ అన్నారు. కర్నూలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ) ప్రాంగణంలో, 10వ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ప్రాక్టీస్ మెటీరియల్ పంపిణీ కార్యక్రాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సబిహా పర్వీన్ మాట్లా డుతూ ఈ ప్రాక్టీస్ మెటీరియల్‌ను సమర్థ వంతంగా వినియోగించుకొని రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి, అని పిలుపునిచ్చారు. సూరి మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ, ప్రభుత్వం మైనారిటీ విద్యార్థుల అభివద్ధి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన ఈ ప్రాక్టీస్ పేపర్లు చాలా ఉపయోగకరమైనవి. విద్యార్థులు ప్రతిరోజూ వీటిని అభ్యసించి తమ ప్రతిభను పెంపొందించుకోవాలి" అని ప్రధాన ఉపాధ్యాయులు పుష్పరాజ్ సూచించారు. ఉపాధ్యాయులు థాహెరున్నిసా, సలేహాబేగం, అబ్దుల్ సుకుర్, ఈమ్రానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎన్ఆర్, జెసిఎస్ ప్రసాద్ సంస్మరణ సభ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



మాజీ ఎంఎల్ సి నీలం రామచంద్రయ్య, ఇంజనీరింగ్ విద్యార్థి జంపాల చంద్రశేఖర ప్రసాద్ అమరులై నేటికీ రూ.50 సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కర్నూల్ నగరం సి క్యాంప్ సెంటర్‌లో డ్రైవర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో అమరత్వానికి 50 ఏళ్లు పేరుమీద బుధవారం సంస్మరణ సభ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సంస్మరణ సభలో నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ల జీవిత చరిత్రపై రూపొందించిన అమరత్వానికి 50 ఏళ్లు పుస్తకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించనున్నారు. ఈ సభకు ఉపన్యాసకులుగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, నాయకులు మల్లికార్జున, నరసింహులు, శేషుపని, రాజు, మణి, అరుణోదయ కళాకారులు తదితరులు హాజరుకానున్నారు పార్టీ కార్యకర్తలు సానుభూతిపరులు మేధావులు, ప్రజాస్వామ్యవాదులు హాజరై సభను విజయవంతం చేయాలని పార్టీ నగర కార్యదర్శి బివిజి వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు.

డబ్బులకు టికెట్లు అమ్ముకునే సంస్కృతి టిడిపిది కాదు

- రాష్ట్ర మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : తెలుగుదేశం పార్టీకి , టిజి కుటుంబానికి డబ్బులకు టికెట్లు అమ్ముకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేటర్ ఎన్నికల్లో పార్టీకి డిపాజిట్లు ఇస్తేనే టికెట్లు ఇస్తారన్న పుకార్లపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఎవ్వరూ నమ్మొద్దని అన్నారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల్లో నమ్మకం పొందిన వారికే టికెట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే నాలుగైదు సార్లు సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పినట్లు తెలిపారు. కార్పొరేటర్ టికెట్ ఇచ్చే ముందు సర్వేలు చేయించి అందులో మొదటి స్థానంలో ఉన్న వారికే టికెట్ కేటాయిస్తా మన్నారు. కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు అర్హత డబ్బు ఎంతమాత్రం కాదని, ప్రజల మనసు గెలిచిన వారికే టికెట్లు ఇస్తామని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదన్నారు. నాయకులు, కార్య కర్తల్లో గందరగోళం సృష్టించేందుకు పనికట్టుకొని ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తుంటారని మండిపడ్డారు.నాయకులందరూ ప్రజల సమస్యలు, వార్డులో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని కోరారు.



దేవరాజు మృతికి సిపిఎం నాయకుల సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సిపిఎం సానుభూతిపరుడు దేవరాజ్ మరణం పార్టీకి వారి కుటుంబానికి తీరనిలోటని సిపిఎం మండల కమిటీ తన సంతాపాన్ని తెలిపింది. ఈరోజు గొందిపర్లలో దేవరాజు మృతదేహానికి సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య మండల నాయకులు రాఘవేంద్ర సీనియర్ నాయకులు ఆంజనేయులు శ్రీరాములు బాలపీరా,వెంకటేశ్వర్లు పార్టీ సభ్యులు మధు,పెద్ద వలి తదితరులు నివాళి అర్పించి వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరాయలసీమ పేపర్ కార్మికులుగా ఉద్యోగ జీవితం ప్రారంభమైన దేవరాజు జీవితం సిపిఎంతో విడదీయరాని అనుబంధం ఏర్పడిందన్నారు. కార్మిక సంఘంలో నాయకుడిగా పని చేశారన్నారు. పేపర్‌మిల్ మూతపడి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సిపిఎం కార్యక్రమాలు, ఉద్యమాలను బలపరుస్తూ తనకు తోచిన రీతిలో సూచనలు అందజేస్తూ ఆర్థిక సహాయం చేస్తూ నిరంతరం పార్టీకి తోడుగా ఉన్నారన్నారు. నాటునుండి నేటి వరకు నిరంతరం ప్రజాశక్తి పాటకుడిగా ఉండి వాముపక్ష సాహిత్యాన్ని బలపరిచిన పాటకుడని అన్నారు. అలాంటి మనిషి మరణించడం పార్టీకి వారి కుటుంబానికి తీరని లోటని వారి మరణానికి ప్రగాఢ సంతాపం వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. పార్టీ ఎప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.

మంత్రి నారా లోకేష్ ను కలిసిన డిసిఎంఎస్ చైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు జిల్లా డిసిఎంఎస్ చైర్మన్, రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు వై. నాగేశ్వరరావు యాదవ్ మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ సమస్యలపై చర్చించామన్నారు. నారా లోకేశ్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించారు. వై.నాగేశ్వరరావు యాదవ్ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పళ్ళా శ్రీనివాస్ రావును కూడా కలిశారు. వై.నాగేశ్వరరావు యాదవ్, నారాలోకేష్, పళ్లాశ్రీనివాస్ రావుకు ధన్యవాదాలు తెలిపారు.

పత్తికొండలో ఘనంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



పత్తికొండ: పత్తికొండలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శారద వృద్ధాశ్రమంలో వృద్ధులకు పళ్ళను పంపిణీ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు నాగలింగన్న, రామాంజనేయులు యాదవ్ మాట్లాడుతూ ఎపిడబ్ల్యు జెఎఫ్ నిరంతరం జర్నలిస్టుల కోసం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అక్రిడేషన్ ఇవ్వడంలో కాలయాపన చేస్తుందన్నారు. అనేక సార్లు రెన్యువల్ చేస్తున్నారని, దీంతో అర్హులతకు అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం జర్నలిస్టుల విషయంలో అక్రిడేషన్ ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ ఇవ్వాలని, కరోనా సమయంలో నిలిపేసిన రైల్వే రాయితీ పాసును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నారెడ్డి, కార్యదర్శి రాముడు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పచ్చ పురుగు గుడ్డు నివారణకు వేప నూనె స్ప్రే చేయాలి

ప్రజాశక్తి- కోడుమూరు

కోడుమూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం శనగ పంటలో నిర్వహించారు. కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ రైతులతో కలిసి ప్రస్తుత పంటల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనగలు తేమ ఎక్కువ ఉన్నందువల్ల ఎండు తెగులు మరియు మొక్కలు పసుపు పచ్చ కలర్ కు వస్తున్నాయి కాబట్టి ఎకరాకు కార్బన్డిజం లేదా %ఝఅషీఓవఎ 500 స్త్రతీఝఎం% స్ప్రే చేసుకోవాలి అలాగే పచ్చ పురుగు గుడ్డు నివారణ కోసం వేప నూనెను ఎకరాకి ఒక లీటర్ చొప్పున స్ప్రే చేసుకోవాలి తగిన ఫలితం వస్తుందని ఈ సందర్భంగా రైతులకు వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.